## క్లుప్తంగా

### నేడు మెగా జాబ్‌మేళా

**ములుగు:** జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ జనరేషన్ మార్కెటింగ్ మిషన్ ఆధ్వర్యంలో గోవిందరావుపేట మండలం చల్వాయిలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో నేడు(మంగళవారం) నిర్వహించనున్న మెగాజాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగించుకోవాలని డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్ సోమవారం వేర్వేరు ప్రకటనల్లో సూచించారు. జాబ్ మేళాలో 50కి పైగా ప్రైవేటు కంపెనీలు పాల్గొననున్నట్లు తెలిపారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు ఉత్తీర్ణత సాధించిన యువత ఉద్యోగమే లక్ష్యంగా మేళాకు హాజరుకావాలని అన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

### బాధ్యతల స్వీకరణ

**వెంకటాపురం(ఎం):** తహసీల్దార్‌గా గిరిబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సదానందం డిసెంబర్ 31న పదవీ విరమణ పొందాడు. ములుగు జిల్లాలోనే తాడ్వాయి తహసీల్దార్ పనిచేసిన గిరిబాబు బదిలీపై వెంకటాపురం(ఎం) మండలానికి వచ్చారు.

**ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా జగదీశ్వర్**

ఎస్ఎస్‌తాడ్వాయి: తాడ్వాయి మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా జగదీశ్వర్‌ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. తాడ్వాయి తహసీల్దార్‌గా పని చేసి గిరిబాబును వెంకటపూర్(ఎం) మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏటూరు నాగారం మండల తహసీల్దార్ జగదీశ్వర్‌ను ఇన్‌చార్జ్ తహసీల్దార్ నియమించారు.

### చైనా మాంజా అమ్మితే చర్యలు

**గోవిందరావుపేట:** ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. పస్రా పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చైనా మాంజాతో మనుషులతో పాటు పక్షులకు ప్రమాదం పొంచిఉందన్నారు.

### కాచి చల్లార్చిన నీటినే తాగాలి

**వెంకటాపురం(కె):** కాచి చల్లార్చిన నీటినే తాగాలని వైద్యాధికారి స్నేహ అన్నారు. సోమవారం మండలంలోని చొక్కాల, మరికల, నూగూరు, ఎదిర గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం స్థానిక కస్తూరిబా గాంధీ పాఠశాలోని విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. వారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సీజనల్‌వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జ్యోతి, మనోహర్ , వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

### బస్సు సౌకర్యం కల్పించాలని వినతి




**వాజేడు:** మండల పరిధిలోని పేరూరు గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఏటూరు నాగారం ఐటీడీఏలోని గ్రీవెన్స్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. వాజేడులోని జూనియర్ కళాశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సంతోశ్ బొల్లె ఆదినారాయణ తెలిపారు. పేరూరులో పశు వైద్య శాల లేదని, గ్రంథాలయం కావాలని, వ్యవసాయ పనులకు వెళ్లే రోడ్లను అభివృద్ధి చేయాలని కోరారు.

### పరామర్శ

**ములుగు రూరల్:** మండలంలోని బండారుపల్లి గ్రామానికి చెందిన గుడెపు రాధిక అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్ సోమవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. రాధిక చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మర్రి రాజుయాదవ్, వంగ రవి, అనిల్, తిరుపతి, రామక్రిష్టారెడ్డి, రాజన్న, దేవయ్య, అశోక్, రాకేశ్ తదితరులు ఉన్నారు.

### శివయ్య మృతి తీరనిలోటు



**ములుగు రూరల్:** జాతీయ మానవ హక్కుల కమిటీ నాయకుడు సంగం శివయ్య మృతి సంఘానికి తీరనిలోటని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య, హైకోర్టు మాజీ ఏజీపీ గౌతం కుమార్ అన్నారు. మండలంలోని మహ్మద్ గౌస్ పల్లిలో సోమవారం శివయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. వారి వెంట సంఘం జిల్లా అధ్యక్షుడు పెట్టెం రాజు, వెంకటేశ్వర్లు, రమేష్, హరిక్రిష్ణ ఉన్నారు.

# ఒత్తిడి అధిగమించేలా..

**ఉత్సాహంగా కొనసాగుతున్న పోలీస్ అన్యువల్ స్పోర్ట్స్**

- నేటితో ముగింపు



హైజంప్ చేస్తున్న మహిళ పోలీస్



రన్నింగ్‌లో పోటీలో మహిళ పోలీసులు



చెస్ ఆడుతున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

**ములుగు:** ప్రతీ రోజు పనుల్లో నిత్యం బిజీగా ఉండే పోలీసు అధికారులు, సిబ్బందిపై కాస్తంత ఒత్తిడి తగ్గించేలా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆలోచన మేరకు నాలుగు రోజులుగా ములుగు మండలంలోని జాకారం డిస్ట్రిక్ట్ ట్రెనింగ్ సెంటర్(డీటీసీ)లోని సువిశాలమైన క్రీడా ప్రాంగణంలో పోలీసు అన్యువల్ స్పోర్ట్స్ ఉత్సాహంగా సాగుతున్నాయి. జిల్లాలోని 10 పోలీస్ స్టేషన్ పరిధిలో సివిల్, ఏఆర్, డీసీఆర్బీ నుంచి 350 మంది పురుషులు, 50 మంది మహిళ అధికారులు, సిబ్బంది క్రీడలను పోటాపోటీగా ఆడుతున్నారు. ఎస్పీ శబరీష్, ఏటూర్‌నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఏఆర్ అడిషనల్ ఎస్పీ సదానందం, ఇన్‌చార్జ్ ఓఎస్డీ రవీందర్‌లు క్రీడాస్ఫూర్తిని కనబరుస్తూ కింది స్థాయి పోలీసులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. నవంబర్, డిసెంబర్ మాసంలో వరుసగా చోటు చేసుకున్న సంఘటనలతో బిజీబిజీగా మారిన అధికారులు సైతం కింది స్థాయి అధికారులు, సిబ్బందితో ఫ్రెండ్లీగా ఆటలు అడుతున్నారు.

**పోటాపోటీగా క్రీడలు**

ఈ నెల 03 నుంచి పురుష, మహిళ పోలీసులకు వేర్వేరుగా క్రీడలు జరుగుతున్నాయి. ఇందులో ఇండోర్‌తో పాటు ఔట్‌డోర్ క్రీడలు ఉన్నాయి. క్రికెట్, హ్యాండ్ బాల్, బ్యాడ్మింటన్, చెస్, క్యారం, లాంగ్ జంప్, హై జంప్, షార్ట్‌పుట్, 10కిమీ, 5 కిమీ, 100 రిలే, 400 మీటర్, 100 మీటర్ రన్నింగ్, టెన్నికాయిట్, థగ్ ఆఫ్ వార్ వంటి ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతీ రోజు ఉదయం 9గంటల నుంచి పోటీలు ప్రారంభం అవుతున్నాయి. అన్ని పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహించే వారంతా ఒకేచోట చేరడంతో డీటీసీ సెంటర్ కోలాహలంగా మారింది. కాగా, నేడు(మంగళవారం) రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందించనున్నట్లుగా తెలుస్తుంది.

**ఫిజికల్ ఫిట్‌నెస్ అవసరం**



ఇతర శాఖలతో పోలిస్తే పోలీసుల్లో ఫిట్‌నెస్ చాలా అవసరం. ప్రజల సంరక్షణే ప్రధానలక్ష్యంగా పనిచేసే వారికి ఆరోగ్యం కూడా అంతే అవసరం. అందుకే మా వంతుగా ప్రోత్సహిస్తున్నాం. క్రీడల్లో ఉన్నతాధికారి, కింది స్థాయి సిబ్బంది అనేది ఉండదు. అందరం కలిసిమెలిసి ఆడాం.

– డాక్టర్ శబరీష్, ఎస్పీ, ములుగు

## గుడిసెలు వేస్తుండగా అధికారుల అడ్డగింత

- హక్కు పత్రాలు ఇవ్వాలని కాలనీవాసుల డిమాండ్
- ఇరువర్గాల మధ్య వాగ్వాదం



అధికారులు, గుడిసెవాసుల మధ్య వాగ్వాదం

**వాజేడు :** మండల పరిధిలోని వాజేడు, పూసూరు గ్రామాల మధ్య ఉన్న ప్రభుత్వ భూమిలో సిమెంట్ స్తంభాలతో గుడిసె వేస్తుండగా తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ కుమారస్వామి, సిబ్బంది వెళ్లి అడ్డుకున్నారు. శాశ్వత భవనాలను వేయవద్దని ఇక్కడి నుంచి ఖాళీ చేయాలని అధికారులు అక్కడ ఉన్న వారికి చెప్పారు. గుడిసెవాసులు, సీపీఎం నాయకులు హక్కుపత్రాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అది ప్రభుత్వం చేస్తుందని వారు ఇస్తారని గుడిసెలను వేసే పని ఆపాలని అధికారులు తెలిపారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గోదావరి ముంపు ప్రజలం మాత్రమే ఇక్కడ గుడిసెలను వేసుకుని ఉంటున్నామని అధికారులు ఆశ్రయం కల్పించాల్సింది పోయి ఖాళీ చేయమనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

## పథకాల అమలు బాధ్యత పర్యవేక్షకులదే..

- డిప్యూటీ డీఎంహెచ్ఓ విపిన్‌కుమార్



మాట్లాడుతున్న విపిన్‌కుమార్

**ములుగు:** క్షేత్ర స్థాయిలో ఆశ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తల విధినిర్వహణ, నిర్దేశించిన ప్రణాళికలు, ప్రభుత్వ పథకాల అమలు షెడ్యూల్ ప్రకారం చేపట్టేలా చూడాల్సిన బాధ్యత పర్యవేక్షకులదేనని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విపిన్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని వైద్యాఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. సికిల్ సెల్ స్క్రీనింగ్‌లను ఈ నెల చివరి వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. చిన్నారులకు, గర్భిణులకు వ్యాధినిరోధక టీకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వ్యాక్సినేషన్ వివరాలను పోర్టల్‌లో ఎప్పటికి అప్పుడు నమోదు చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా ప్రొగ్రాం అధికారులు డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ రణధీర్, ఇన్‌చార్జ్ డెమో సంపత్, దుర్గారావు, శకుంతల, స్వరూపారాణి, అరుణ, సురేష్‌బాబు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పోరాటయోధుడు కొమురం భీం

- తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బాలకృష్ణ, తహసీల్దార్ వేణుగోపాల్

**కన్నాయిగూడెం:** జల్ జమీన్ జంగిల్ పేరుతో పోరాటం చేసినయోధుడు కొమురం భీం అని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పులిసే బాలకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం తహసీల్దార్ వేణుగోపాల్ చేతుల మీదుగా కొమరం భీం విగ్రహావిష్కరణ కరపత్రాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ కన్నాయిగూడెం మండలంలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయటం సంతోషకరమన్నారు. పోదెం బాబు, రవీందర్, పోదెం కృష్ణ ప్రసాద్, కోటయ్య, యాలం మురళి తదితరులు ఉన్నారు.

## ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ పెంచాలి

- దండిగ వెంకన్న



మాట్లాడుతున్న వెంకన్న

**ములుగు రూరల్:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామి మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌లను పెంచాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దండిగ వెంకన్న అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి బహిరంగ సభలో 23శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని హామి ఇచ్చి అమలు చేయడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాదం కుమార్, నాగరాజు, గుగులోత్ స్వరూప, పాపిరెడ్డి, కట్టయ్య, సాగర్, సారయ్య, రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంబాబు



నిరసన తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

**వెంకటాపురం(కె):** రైతులకు రైతు భరోసా ఇవ్వకుండా రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంంపా రాంబాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వేల్పూరి లక్ష్మీనారాయణ, జాగర శంతమూర్తి, గడ్డం వివేక్, మద్దుకూరి నెహ్రూ, నారాయణమ్మ, జానకమ్మ, ఆదిలక్ష్మి, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సౌత్‌జోన్ వర్సిటీ వాలీబాల్ టోర్నీకి ఎంపిక



**గోవిందరావుపేట :** ప్రాజెక్ట్ నగర్ గ్రామానికి చెందిన ముక్లోత్ స్రవంతి రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో ప్రతిభ చాటింది. ఈ నెల 7 నుంచి 11 వరకు తమిళనాడు రాష్ట్రంలోని చెంగల్‌పట్టు జెప్పియార్ యూనివర్సిటీలో సౌత్ జోన్ యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ టోర్నమెంట్‌లో కాకతీయ యూనివర్సిటీ టీం నుంచి స్రవంతి పాల్గొననుంది. ఈ సందర్భంగా ఆయా యూనివర్సిటీ విద్యార్థులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## ఎస్సైకి సన్మానం



ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

**వాజేడు:** వాజేడు ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎన్ రాజ్‌కుమార్‌ను బీఎస్పీ పార్టీ మండల నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువ కప్పి సన్మానించారు. ఎస్సైని కలిసిన వారిలో భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండా చరణ్, మండల ఇంచార్జ్ కుమ్మరి రాంబాబు, జాడి ప్రభాకర్, సాధన పల్లి మోహన్ రావు, కెమెర సంజీవరావు, శ్యామల సంజీవరావు ఉన్నారు.

## సత్రాలు నిర్మించాలి



వినతిపత్రం అందిస్తున్న కొత్త సురేందర్

**ములుగు రూరల్:** మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరలో లక్ష్మీదేవరలకు విడిది సత్రాలను నిర్మించాలని ఆదివాసీ నాయకపోడు సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ టీఎస్ దివాకరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడారం మహా జాతరలో రాష్ట్ర నలుమూల నుంచి 150 లక్ష్మీదేవరలు అమ్మవార్ల దర్శనానికి వచ్చిన లక్ష్మీ దేవరలకు విడిది లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సంఘం నాయకులు కొత్త సదయ్య, ఆకుల మొగిలి, ఆకుల రాజు, కొత్త లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న సుధాకర్

**గోవిందరావుపేట:** బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో దబ్బ సుధాకర్ నాయక్‌పోడ్‌కు కొమురం భీం నేషనల్ అవార్డును అందజేశారు. మండల పరిధిలోని పస్రా గ్రామానికి చెందిన దబ్బ సుధాకర్ నాయక్‌పోడ్ ఈ నెల 5న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన బహుజన సాహిత్య అకాడమీ ఎనిమిదోవ తెలంగాణ రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్ఏ) జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

## ‘దళితబంధు నిధులు కేటాయించాలి’



అభివాదం చేస్తున్న నాయకులు

**ములుగు:** సంక్రాంతిలోపు రెండోవిడత దళితబంధు నిధులు కేటాయించి అర్హులైన లబ్ధిదారుల ఖాతాలలో డబ్బులు జమ చేయాలని రాష్ట్ర దళితబంధు సాధనసమితి అధ్యక్షుడు కోకిల మహేష్, కన్వీనర్ చిట్టిమల్ల సమ్మయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన దళితబంధు ఆత్మగౌరవ మహాసభకు ఇరువురు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. దళితబంధు విషయంలో ప్రభుత్వానికి వినతులు అందిస్తూనే ఉన్నా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. దళితబంధు అమలు అయితే సొంత కాళ్లపై నిలబడవచ్చని వేలాది కుటుంబాలు ఎదురుచూస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో హైదరాబాద్‌లో భారీసభ ఏర్పాటు చేసి ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామన్నారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీపీ మేకల గౌతం కుమార్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి, సీపీఎం జిల్లా కార్యదర్శి సాంబశివ, ప్రజాసంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో ఆర్డినేటర్ మడికొండ రమేష్, సంజీవ, కావేరి చిన్నికృష్ణ, రాజేశ్, శ్రీనివాస్, రామన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి



నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

**ఏటూరునాగారం:** అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ నాయకురాలు పార్వతి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎండీ దావూద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండాను వారు ఆవిష్కరించి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లకు వచ్చే ఫలాలను అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పూనెం రాధ, వెంకటేశ్వరి, సీఐటీయూ నాయకులు అల్లావొద్దీన్, నాయిని కృష్ణ పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి



మాట్లాడుతున్న రవి

**ములుగు రూరల్:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించాలని , ఖాళీ పోస్టులను భర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ఫీజు రియబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేపడుతున్న కారణంగా విద్యార్థులు నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి సమగ్రశిక్షా ఉద్యోగులు, సీఆర్టీల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, భరత్, లక్ష్మణ్, రమేష్, సాయిచరణ్, అరుణ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## కబ్జాను అరికట్టాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**మంగపేట :** మండలంలోని చెరువులు, కుంటల శిఖం భూముల కబ్జాను అరికట్టాలని కోరుతూ మన్యసీమ పరిరక్షణ సమితి డోలుదెబ్బ మండల అధ్యక్షుడు తాటి నాగరాజు సోమవారం తహసీల్దార్ తోట రవీందర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. మండలంలోని 150 చెరువులు, కుంటలు ఉండగా ప్రస్తుతం ఎన్ని చెరువులు, కుంటలు ఉన్నాయి, ఎన్ని చెరువుల కబ్జాకు గురయ్యాయనే పూర్తి సమాచారాన్ని ఇవ్వాలని వినతిలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కమలాపురం మొదలుకుని జిల్లా సరిహద్దు వరకు ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డు వెంట ఉన్న చెరువుల్లో శిఖం భూములు పూర్తిగా కబ్జాకు గురయ్యాయన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ ప్రజా సంఘాల జేఏసీ నాయకులు పోలెబోయిన ఆదినారాయణ, అన్నెబోయిన సమ్మయ్య, తోలెం నర్సింహారావు, కోరెం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ పనుల్లో వేగం పెంచాలి

- ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం



పనులను పరిశీలిస్తున్న ఈఈ వీరభద్రం

**ఎస్ఎస్‌తాడ్వాయి:** కమ్యూనిటీ హాల్ నిర్మాణాల పనుల్లో వేగం పెంచాలని ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం అన్నారు. గవర్నర్ దత్తత తీసుకున్న మండలంలోని కొండపర్తి గ్రామంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రూ.70లక్షలతో చేపట్టిన రెండు కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులను ఆయన సోమవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. త్వరితగతిన పనులు పూర్తి సంబంధిత గుత్తేదారులకు సూచించారు.

## రోడ్ల నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపనలు

- ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్న మంత్రి సీతక్క

**ఎస్ఎస్‌తాడ్వాయి:** మండల పరిధిలోని లింగాల, బంధాల గ్రామపంచాయతీల పరిధిలోని మూడు బీటీ రోడ్ల నిర్మాణం పనుల నేడు(మంగళవారం) శంకుస్థాపనకు మంత్రి సీతక్క హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో రోడ్ల నిర్మాణం పనులను చేపట్టనున్నట్లు వెల్లడించారు. రూ. 5కోట్లతో కొడిశాల నుంచి పోచాపూర్ వరకు, రూ. 3.80 కోట్లతో లింగాల నుంచి బొల్లెపల్లి, రూ.4కోట్లతో పోచాపూర్ నుంచి బంధాల వరకు, రోడ్ల నిర్మాణం పనులను చేపట్టనున్నారు. ఈ పనుల నిర్మాణాలకు మంత్రి సీతక్క శంకుస్థాపన చేయనున్నారు. గిరిజనుల సమస్యలపై పోచాపూర్‌లో ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సోమవారం ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం శంకుస్థాపనకు సంబంధించి శిలఫలకాల ఏర్పాట్లను పరిశీలించారు. పోచాపూర్‌లో ప్రజా దర్బార్ నిర్వహించనున్న సందర్భంగా పీఓ చిత్రమిశ్రా ఆదేశాల మేరకు ఐటీడీఏ ఏఓ రాజుకుమార్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీఓ సుమనవాణి, పెసా కొఆర్డినేటర్ ప్రభాకర్‌లు ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజాదర్బార్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



ఏటూరునాగారం: అవగాహన కల్పిస్తున్న పోలీసులు



ఎస్ఎస్ తాడ్వాయి: మాట్లాడుతున్న ఎస్సై

- ఎస్సై తాజొద్దీన్

**ఏటూరునాగారం:** వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని ఎస్సై తాజొద్దీన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఆటో డ్రైవర్లు, టాటా ఏసీ డ్రైవర్లు, డీసీఎం డ్రైవర్లు, ట్రాక్టర్ డ్రైవర్లకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిబంధనలు అతిక్రమించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు.

**ఎస్ఎస్‌తాడ్వాయి:** రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ట్రైనీ ఎస్సై జగదీశ్వర్ రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో జాతీయ రహదారిపై వావానాదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు దాటే క్రమంలో జాగ్రతలు పాటించాలన్నారు, ఆయన వెంట కానిస్టెబుళ్లు రమేష్, రజినికర్, చందర్ ఉన్నారు.